# చీమబ్రతుకు



ఆర్.యస్.కె.మూర్తి

'ఛీ. ఛీ పాడు బ్రతుకు' — వళ్ళు విరుచుకుంటూ ఆగిపోయింది, వరుసలో వెళ్తున్న చిరుచీమ.

చీమలు బారులుకట్టి వెళ్తున్నాయి. ఏవో పరుగులు పెడుతున్నాయి. పుట్టి మునిగినట్టు ప్రళయం ముంచుకొస్తున్నట్టు చలి కాలం మీదకు దుమికేస్తున్నట్టు తిండి కరువొచ్చి చీమజాతంతా సర్వనాశనం కాబోతున్నట్టు ఏదో హడావుడి! గబగబ గింజలు మోసుకెళ్ళాలి. గూళ్ళను నింపుకోవాలి. వేసవి వెళ్ళకముందే ఏ తేర నిండే వనరులు సమకూర్చుకోవాలి.

చీమలన్నీ గింజలు నోటి కంటించుకొని పరుగులు పెడుతున్నాయి — వరుసలలో!

రాయుడు అనే చిరుచీమకు వళ్ళు హూనమైపోతున్నది. ఈ హడావుడి అతగాడికి నచ్చలేదు. ఎంతగా పరుగులు పెడ్తే మాత్రం ఏమిటి ప్రయోజనం! ఎప్పటికి నిండేను, ఈ ధాన్యపుగూళ్ళు! నిండి మాత్రం ఏమిటి సుఖం! నింపుకొన్న సొమ్ము నోటికందేలోగానే ఏ కాలిక్రిందనో పడి నలిగిపోమని నమ్మకమేమిటి? ప్రతి నాలుగు క్షణాలూ పరుగులు పెట్టటం! ఏదో అందుకోవాలని ఆత్రత చెందటం అందీ అందకనే అడుగు క్రిందపడి ధ్వంసమై పోవటం!

'ఛీ ఛీ. పాడు బ్రతుకు'— అనిపించింది, చిరుచీమ రాయుడికి. వళ్ళు విరుచుకుంటూ నిలిచిపోయింది, వరుసలో వెళ్తున్న రాయడు చీమ.

వరుసలో ఉరకలు పెట్టుకొస్తున్న మరో చీమ, మరో చీమ రాయుడ్ని రాసుకుంటూ వెళ్ళిపోయినై. అట్లాగే మరోటి, మరొకటి. చివరన వచ్చిందో చిన్నారి చీమ. అదే మిసెస్ రాయుడు. మిసెస్ రోజీ రాయుడికి తన రాయుడిట్లా వళ్ళు విరుచుకుంటూ కూర్చోటం ఆశ్చర్యం కలిగించింది.

"ఏంటయ్యా, అలా కూలబడ్డావు?" అని అడిగింది, చీమ భాషలో.

'ఆ, పోదూ, వెధవ బ్రతుకు! విసుగు పుడుతున్నది' — అంటూ మరోసారి వళ్ళు విరుచుకుంది, రాయడు చీమ.

'సంబడమే. వేదాంతం చెప్తున్నావే, అప్పుడే. ఇంకా గూట్లో సగమైనా నిండలేదు. రేపో, నేడో నేను మరిన్ని గుడ్లు పెట్టబోతున్నాను. వచ్చేదేమో చ(క)లి కాలం. ఇప్పుడిలా కూలబడిపోతే, రేపు పిల్లల గతి ఏం కావాలంటావు? లే ... లే—' అని అదిలించింది. సైజులో రాయుడి కంటే ఓ చుట్టు ఎక్కువేఉన్న మిసెస్ రాయుడు.

'అదికాదే, చీమభామా! మనమెంత కష్టపడి ఏం లాభం చెప్పు. ఆ చలి చీమలు చూడు. ఎంచక్కా రెక్కలతో రివ్వున ఎగిరిపోతున్నయ్యో! వాటి ధాన్యపు గూళ్ళు చూడు, చకచకా ఎలా నిండి పోతున్నయ్యో! మనకీ అలా రెక్కలుంటే..'

'విషాదంలోకి జారిపోయింది, రాయుడు చీమ.

ఏనుగంత సమస్యకు తన చీమ బుద్ధితో పరిష్కారమార్గం కనిపెట్టేసింది రాయుడు అనే చిరుచీమ.

చలిచీమలా రెక్కలుంటే సర్పసమస్యలూ దూదిపింజలైపోతయ్యనే నమ్మకం కలిగింది, రాయుడు చీమకు.

చిరుచీమకు, తనో చలిచీమను కావాలనే, కోర్కె పుట్టింది!

## ఇది నాందీ ప్రస్తావన!

### ఇదేమో పూర్వరంగం!

'పోదూ, వెధవ బతుకు! ఎంత కష్టపడి ఏమిటి లాభం! ఈ చిట్టి, చిట్టి సంపాదనలతో ఎప్పటికి ఉట్టికెక్కేను?—' అన్నాడు, చిట్టిబాబు.

'అబ్బో, అప్పుడే ము జనమార్గం పట్టేటట్లున్నారే? ఇద్దరు కూతుళ్ళకి పెళ్ళిళ్ళు చెయ్యాలి. ముగ్గురు కొడుకులకు కోడళ్ళను తేవాలి. అప్పుడే కాడి పారేస్తే ఎట్లాగండీ? కాస్త ఆ పాలూ, బెస్టా సీట్లో ఉండంగానే చలికాలాన్ని గురించి ఆలోచించండి. ముందంతా ఖర్చుకాలమే—' అంది అతని యింటి యిల్లాలు, జాకెట్టు గుండీలు పెట్టుకుంటూ.

ఆవిడో పిచ్చియిల్లాలని, తినటం, సంసారం చెయ్యటం తప్ప మరోటి తెలియనిదని ఆవిడ్నిగురించి చిట్టిబాబుకున్న పిచ్చి అభిప్రాయం.

'పోదూ, వెధవ సంపాదన, చీమ సంపాదన! ఎప్పి బల్లలక్రింద చేతులు పెట్టే బ్రతుకులు తెల్లవారేను'— అన్నాడు. వళ్ళువిరుచుకుంటూ చిట్టిబాబు

'అబ్బో. వేదాంతం ముదిరే పోయింది!' అంది నవ్వుతూ. చీరె కట్టుకోటానికి లేచింది, మిసెస్ చిట్టిబాబు.

'వేదాంతంకాదే, వెర్రిమొగమా! జీవితసత్యం! ఆ సుబ్బయ్య చూడు. ఎంచక్కా నాలుగు కాంట్రాక్టులుచేసి. మేడ లేపేసాడ్! ఐదూ, అర్ధా కతికి మనమెప్పటికి పైకి వస్తామే, పిచ్చి మాలోకమా!' అంటూ మరోసారి వళ్ళు విరుచుకున్నాడు — గవర్నమెంటు హెడ్క్వార్టర్స్ హాస్పిటల్ గుమాస్తా, చిట్టిబాబు!

### ఇదీ పూర్వరంగమే!

ఒకప్పటి చిట్టిబాబు తాను ఉత్త గుమాస్తానని అనుకొనేవాడు కాదు. మెడికల్ డిపార్టుమెంటు ఉద్యోగినని అనుకునేవాడు. ఎందుకనంటే అతను మామూలు గుమాస్తాల కంటె కాస్త ఎక్కువ హాయిలోనే జీవితాన్ని గడుపుతుంటాడు— అతనుండే సీట్లు పుణ్యమా అని. అంతే కాదు. అతను అప్పుడప్పుడు కథలు గట్రా వ్రాస్తుంటాడు. దాంతో సోషలు లైఫు కూడ అతనికి కాస్తో కూస్తో ఉన్నదనే చెప్పాలి మామూలు గుమాస్తాలకి అందుబాటులోకి రాని కొన్ని సుఖాలు, కొన్ని అనుభవాలు కూడ అతను అందుబాటులోకి తెచ్చుకోగలిగాడు. ఉదాహరణకతను, ప్రొహిబిషను తీసెయ్యకముందే, బ్రాందీ తాగాడు. హైదరాబాదు హోటల్లో బసచేసిన ఓరాత్రి, అతను ధైర్యం చేసి హోటలు బాయ్ చేత బ్రాందీ తెప్పించుకొని తాగాడు. అయితే బ్రాందీకోసరం తాని (?) చేశానని అతననుకోడు, అది తాగిన అనుభవమెలా ఉంటుందో తెలుసుకోటానికే తానావని చేశాననుకుంటాడు, చిట్టిబాబు. ఇట్లాంటివే అతని జీవితంలో మరికొన్ని అనుభవాలు చెప్పరానివి! చెప్పలేనివి!

మొత్తంమీద జీవితంలో కాస్తో, కూస్తో అడ్వెంచరు చూసినవాడే, చిట్టిబాబు.

అయితే ఈ మధ్య కొన్నిరోజులుగా అతని మనసు కంగాళీగా ఉంటున్నది. రాత్రిళ్ళు తెల్లవార్లూ శ్మశానవిహారాలు చేస్తున్నది, కొరివిదెయ్యంలా ఏదో బాధ దాన్ని పీడిస్తున్నది. ఎదురుదెబ్బ తగిలిన కాలివేలినుండి రక్తం కారుతుంటుంది. నొప్పిమాత్రం వెంటనే తెలియదు. రక్తం గడ్డకట్టి, పగిలిన చర్మం బిరుసెక్కితే తప్ప బాధ బయటకు రాదు. చిట్టిబాబు మనస్సుకి అట్లాంటిదే ఎదురుదెబ్బ తగిలింది.

చీమ బ్రతుకు కాదా, తనది?

ఈ ప్రశ్న చిప్పక్కున మనస్సుకి తగిలి కసిక్కున గాయమైంది.

బారులు తీరిపోతున్న చీమలను గమనించాడు, చిట్టిబాబు కొన్ని ఆలోచనలు ఆ కథకుడి బుర్రలో గింగిరాలు తిరిగినై. చీమలు గూళ్ళను పకడ్బందీగానే కట్టుకుంటై. చచ్చేటట్లు శ్రమపడి గింజల్ని పోగుచేసుకుంటై. కాని, జీవితకాలమంతా కష్టించినా, అవి ఓ, గిద్దెడు గింజలు నిల్వ చేసుకోగలవా?

తనదిమాత్రం అంతకంటె ప్రయోజనకరమైన జీవితమా ఏమిటి?— అనిపించింది, చిట్టిబాబుకి.

ఎంతగా బల్లలకింద చేతులుపెడ్తే మాత్రం, ఓ చెక్కపుస్తకం సంపాదించుకోగలడా, తాను?

ఈ ఆలోచనే తన మనస్సుకి ఎదురుదెబ్బలా తగిలింది. అందుకే అతననుకున్నాడు —ఐదూ, అర్ధా కతికి ఎప్పటికీ పైకి వచ్చేరూ— అని సుబ్బయ్యలా ఎప్పటికి వేడకళ్ళేమా— అని.

ఏనుగంత సమస్య ఎదురైంది. చిట్టిబాబుకు.

తన చిట్టి మనస్సుతో ఇట్టే పరిష్కారం కనిపెట్టేశాడు; అదే...ఓ లాటరీ టిక్కెట్టు కొని పారేశాడు, చిట్టిబాబు. చలిచీమలా రెక్కలుంటే చిరుచీమ బ్రతుకు నుంచి తప్పించుకోవచ్చుననుకున్నాడు.

### అమ్మయ్య! అసలుకథ కొచ్చాం!

లాటరీలో వచ్చిన డబ్బుతో చిట్టిబాబు సమస్యలన్నీ పరిష్కారమై ఉంటే అతని కథ చెప్పుకోవలసిన అవసరమే ఉండేదికాదు—కాపీరైటు చట్టాన్నికూడా ధిక్కరించి.

ధిక్కరించటమే ఐటంటే, తన యీ లాటరీకథ ఏ రూపంలోను యితరులు వాడుకోవటం యిష్టంలేదు, చిట్టిబాబుకి. లాటరీలో తనకు వచ్చినడబ్బు తనకు మరిన్ని సమస్యలను తెచ్చిపెడుతుందని ఊహించలేదు, అతను. చలిచీమలా ఎగరటంలో, ఉన్నరెక్కలను చేస్తున్న కలికను పోగొట్టుకోవలసి వస్తుందని అనుకోలేదు అతను.

లాటరీలో డబ్బు వచ్చింది, చిట్టిబాబుకి అందులో సందేహం లేదు.

తనకు లాటరీలో డబ్బు వస్తుందని విశ్వసించటంలో కూడ పొరపాటేమీ చెయ్యలేదు చిట్టిబాబు. ఈడబ్బు రావటానికి సరిగ్గా రెండునెలలా పదమూడు రోజుల నాడు అతను మొదటిసారిగా లాటరీ టికెట్టు కొన్నాడు. అప్పుడది హర్యానా లాటరీ. ప్రైజు లక్ష రూపాయలు. ఆలక్ష రూపాయలు తనకే వస్తయ్యని నమ్మటంలో లోపమేమీ చెయ్యలేదు, చిట్టిబాబు. ఆ లక్ష్మి ఎట్లా ఖర్చుచెయ్యాలో కూడ అతను

# చీమ బ్రతుకు

తగినంత పకడ్బందీగానే ఆలోచన చేసి పెట్టుకున్నాడు. చలిచీమగా తన కార్యక్రమాలను గురించి చక్కటి రూపకల్పనే చేసుకున్నాడు, చిట్టిబాబు.

తనకొచ్చిన డబ్బుతో ముందో చక్కటి మేడ కట్టుకోవాలి. చిట్టిబాబుకు పిత్రార్జితమైన యిల్లొకటి ఉంది. అది రెండుగదుల డాబా యిల్లు. డాబా పాతబడి పోయింది. స్థలం మాత్రం లంకంత. ఆ డాబానే మార్చెయ్యాలి. పైఅంతస్తు వేయించాలి, హాలులోనుంచి— సినిమా సెట్లలోలగ— పైకి మెట్లు కట్టించుకోవాలి. కాని తన డాబా యింటిహాలు చిన్నది కదా? అక్కడినుంచి మెట్లు అవి కుదిరేటట్లు లేదు. పోనీ యిల్లంతా పడగొట్టించి కొత్తది వేయిస్తే?

అందుకు చిట్టిబాబు మనసొప్పలేదు. అతనికి సెంటిమెంటు ఎక్కువ. తాతముత్తాతల కాలనుంచీ వస్తున్న యింటిని పడగొట్టించటమంటే అతనికి మనస్సు చివుక్కుమన్నది. వచ్చిన లక్షరూపాయలను తనకున్న సుఖాలకు కలుపుకోవాలనుకున్నాడే తప్ప, ఉన్నదాన్ని నాశనం చేసుకొని కొత్తది నిర్మించుకోవాలని అనుకోలేదు, చిట్టిబాబు. జీవితంలో కాస్తో, కూస్తో సుఖాలను రుచిచూచినవాడే కదా అతను!

సీతాపతి చిట్టిబాబుకో క్లర్కు. అతనికి సీతాపతి అని పేరు పెట్టినందుకు వాళ్ళ నాన్నకు అంచనాను వేశారు. అతనికీ, ఏకపత్నీవ్రతానికీ అంతటి దూరం, అతనుండేది నర్సుల లీవులు, జీతాలు చూచే సీట్లో. అక్కడ అతనికి లభించిన పరపతి అంతా అతను పరసతి సంపాదనకొరకే వినియోగిస్తూ ఉంటాడు. సీతాపతి అన్నాడు వోసారి!

'ఒరేయ్, చిట్టీ నీకా లక్షా రాంగానే ఏంచక్కా మన కాజుయార్డ్లీవాళ్ళ సింగారి లేదూ? దాన్ని తీసుకొని మద్రాసు వెళ్ళోయ్. సింగారి హీరోయినుగా వో బ్రహ్మాండమైన సినిమా తీసెయ్యి.'

ఈమాట విన్న చిట్టిబాబుకి ఒళ్ళంతా తేళ్ళు, జెర్రులు పాకినట్లయింది. పళ్ళు యెత్తు పద్మప్రియ తనను చూచి నవ్వినప్పుడు ఫీలయ్యేటట్లు ఫీలయ్యాడు. చెప్పలేనన్ని అనుభవాలు కొన్ని చిట్టిబాబుకి ఉన్నయ్యన్నాం కదా? వాటిల్లో ఒకటి ఈ పద్మప్రియ. ఇతన్ని చూసినప్పుడల్లా నవ్వుతుంటుంది. దాంతో అతనికి ఎప్పుడో, ఎక్కడో పడ్డ తాన్యతయం గుర్తుకొచ్చి ఒళ్ళంతా జెర్రులు పాకినట్లవుతుంది. సీతాపతి అన్నమాటలకు అతనికి అలానే చిరాకు పుట్టింది. చిట్టిబాబు భార్య పిచ్చి యిల్లాలు. తన ఐదుగురు పిల్లలకు ఆమె తల్లి. ఆమెను కాదని అనుకోవటం — లక్షాధికారి ఐతే మాత్రం — తనకు సబబేనా?

కాకపోతే లక్షాధికారిగా తాను తన భార్యదగ్గర కొంతహోదా వెలగపెడ్తాడు తాను పైగదిలో ఉంటాడు. ఫలహారాలూ అవీ అక్కడికే తెస్తుంటుంది భార్య. రాత్రికికూడ పిల్లలందరూ క్రింది గదులలో నిద్రపోయిన తర్వాత పైకి వస్తుంది.

అప్పటికి తనకు సరదాగా ఉంటే ఆమెతో కొంత కాలక్షేపం చేస్తాడు. లేదూ అంటే పక్క బెడ్డుమీద పడుకొని నిద్రపోతుంది అంతే

సీతాపతిగాడ్ని పాతెయ్యాలి./ వెధవ మాటలు వీడూను. అది సరే సింగారి రంగేళి గొడవలు లేకపోయినా, మేడ ఉండాలి కదా? దానికే ప్లాను కుదరటంలేదు. పోనీ యిల్లంతా మార్పించి, కొత్తది కట్టిస్తే ఓ అరవై, డెబ్బయివేలు యింటికే ఖర్చవుతుంది. మరి మేడఉన్న తర్వాత కారు ఉండకపోతే ఏం బాగుంటుంది?

కారు కొనాలనే నిర్ణయం చిట్టిబాబు ఏనాడో చేసుకున్నాడు. వాళ్ళ యింటిముందు ప్రహరీగోడలో ద్వారం ఓ పెద్ద గేటు ఉండేది— మేడ్ ఆఫ్ బాంబూస్! వాళ్ళ తాతగారు దాన్ని అలా ఉంచారు. ఆయనకు వ్యవసాయం చేయించాలని మహా సరదాగా ఉండేది సొంత వ్యవసాయం సొంత ఎడ్లు. బండి సరాసరి దొడ్లోకి వెళ్ళటానికి ఆయనా వసారాలో గేటు వదిలి పెట్టించారు. ఆయనకు కాస్త కవిత్వంలో పరిచయముండేది. వాళ్ళ ఊరికి కలెక్టరు దొర వచ్చినప్పుడు ఈయన నవరత్నాలు చదివాడు. దొరకి తెలుగురాదు. కవిగారికి యింగ్లీషు రాదు. మధ్య దుబాసీగా పనిచేసి నాయన దొరగారు ఆ పద్యాలను తెగమెచ్చుకొన్నారని చెప్పాడు. కవిగారు సంతోషించి, వెండి పొన్నువేసిన తన నస్యం డబ్బిని దుబాసీకి బహుమానమిచ్చేశారు. ఆ దుబాసీ ఎవరో కాదు చాలకాలంగా ఆ నశ్యం డబ్బిమీద కన్నేసి ఉన్న వాళ్ళ ద్వారి వీధి అరుగు బడిపంతులే కదా? అయినా కవిగారికి తన కవిత్వానికి రాజాదరణ లభిస్తుందని, నానారాజసందర్శనంచేసి అగ్రహారాలు సంపాదించి, స్వంత వ్యవసాయం చెయ్యాలని మోజుగా ఉండేది. ఆ హోదాకి పూర్వరంగంగానే ఆయన గేటు పెట్టించాడు. కోరెక్కమాత్రం తీరకుండానే ముసలిసీను నిర్యాణం చెందింది!

కవిగారి కుమారుడు, చిట్టిబాబు తండ్రియైన గోపాలం ఉద్ద మొద్దు



బ్బాయిగా ఆయనకి పెద్ద హడావుడి ఉండేది కాదు. అందుకే ఆయన గేటు తీయించేసి, గోడ కట్టించేశాడు. చిట్టిబాబుకి దాన్ని మళ్ళా గేటుగా మార్చి, కార్లో తోలించాలని సరదా! కాబట్టి కారు కొనక తప్పదు. కారు ఎంతలేదన్నా ఓ ఇరవై వేలు అవుతుందిట! అదీ ఎలాటుమెంటులో వస్తే, లేకపోతే యింకో పది వేలన్నా పెట్టాలి. ఎలాటుమెంటు ఎప్పటికి వచ్చేదో, ఏమో? కాబట్టి ముప్ఫయి వేలు ఖర్చుపెట్టక తప్పదు.

వచ్చిన లక్షా మేడకీ, కారుకే సరిపోతే, తర్వాత? మళ్ళా మామూలు గుమాస్తా ఉద్యోగం చెయ్యాలా? ఛీ. ఛీ. అనిపించింది, చిట్టిబాబుకి. అదికాదు. ముందీ డబ్బుని పెంచాలి. ఎట్లా? వ్యాపారమేదన్నా చేస్తే?

వ్యాపారం చెయ్యాలంటే చాలరకాలున్నయ్యనుకోండి, కాని వాటి కన్నింటికి లైసెన్సులూ, పర్మిట్లూ కావాలికదా? చిట్టిబాబు స్నేహితుడొకడు తనవాటా కొచ్చిన రెండువేలతో హాస్పిటలుముందు బంకు పెడదామనుకున్నాడు. దానికి అవసరమైన లైసెన్సులన్నీ సంపాదించేటప్పటికి ఆ రెండువేలు ఖర్చయిపోయి, అయ్యావాడు మిగిలాడు. ఇప్పుడతను ఆస్పత్రి చెట్లనీడలలో, అనేకమంది నర్సులకు పర్సనలు అస్సెంటుగా పనిచేస్తున్నాడు.

లైసెన్సు సంపాదించేటప్పటికే తన డబ్బు హుళక్కి అయిపోతుందేమోనని భయమేసింది, చిట్టిబాబుకి: అదీగాక, ఈ టాక్సు గొడవ ఒకటిలేదూ? లాటరీ డబ్బుకంటె టాక్సులేదు. కాని ప్రభుత్వం కళ్ళన్నీ ఆ డబ్బుమీదనే ఉంటై. దాంట్లో రూపాయి ఖర్చుపెట్టి. ఇంకోరూపాయి సంపాదిస్తే, అదీ, యిదీ కలిపి దోచేస్తుంది, టాక్సుల ప్రభుత్వం. పాపం, సినిమా స్టార్లు అందుకేగదా, వాళ్ళడబ్బుని బాత్ రూం గోడల్లో దాచుకోవటం? ఎట్లా గబ్బా? మేడ, కారు హోదా నిలుపుకోవాలంటే వ్యాపారం చెయ్యాలి. చెయ్యాలంటే లైసెన్సులు! టాక్సులు! గోల!

ఇండియా దటీజ్ భారత్ ప్రభుత్వం వారి లైసెన్సింగు విధానపు చిక్కుముడి విప్పి, సదరు ప్రభుత్వంవారి పన్నుల గొడుగుకి చిల్లులు పొడిచి, డబ్బును పెంచి. మేడ, కారు, హోదా నిలుపుకోవటం ఎట్లాగా అని చిట్టిబాబు మధనపడుతుండగానే—ఆ లాటరీ ఫలితాలు వచ్చేసినై.

అమ్మయ్య! తనకు ప్రైజు రాలేదు.

* * *

పీడా పోయిందిలే — అనుకున్నాడు చిట్టిబాబు. చాలీచాలని ఆ లక్షా రాకుండా ఉండటమే మంచిది.

చిట్టిబాబుకి జ్యోతిషంలో నమ్మకముంది. ప్రస్తుతం అతనికి గురువు మహర్దశలో ఉన్నాడు. ఈ పీరియడులో అతనికి ఉద్ధరగా డబ్బు వచ్చి పడుతుందని జోస్యులు బల్లగుద్ది మరీ చెప్పారు. అసలు చిట్టిబాబుకే ఆ నమ్మకమున్నది. కాబట్టి ఏ కాస్తో వచ్చి, జోస్యం నిజమై, మార్కెట్ లాగా, తనకు చిక్కులు ఎక్కువ చేసేకంటె, ఆ చిన్నమొత్తం రాకుండా ఉండటమే మంచిదికదా?

రాజస్థాన్ లాటరీ ఇరవై ఒక్కలక్షలకీ ఎంచక్కా ఆ ప్రైజు తీసుకుంటే, హాయిగా తనకోర్కెలన్నీ తీర్చుకోవచ్చు ననుకున్నాడు చిట్టిబాబు.

టికెట్టు కొన్నాడు, చిట్టిబాబు.



హుర్రే! న్యూమరాలజీ ప్రకారం తనకు ఖచ్చితంగా నప్పిన నెంబరు!

చిట్టిబాబుకి న్యూమరాలజీమీద కూడ నమ్మకమున్నది. అందుకే క్రిందటిసారి టిక్కెట్టు కొన్నప్పుడు తనకు సరిపొయ్యే నెంబరున్న టిక్కెట్టే తీసుకున్నాడు. ఈసారి అలా చెయ్యలా. ఓ టిక్కెట్టు యివ్వవోయి—అన్నాడు.

'ఏ నెంబరుసార్?' అని అడిగాడు అంకువాడు.

'ఏదోటి ఇయ్యవోయి. నెంబరులో ఏముంది?' అన్నాడు చిట్టిబాబు

## చీమ బ్రతుకు

తీరామాస్తే ఆ టిక్కెట్టు నెంబరు లోని అంకెలన్నీ కూడితే మొత్తం ఇరవై ఏడు. మళ్లా ఆ రెండు అంకెలు కూడితే తొమ్మిది. తన డేట్ ఆఫ్ బర్తు మూడు. తొమ్మిది తనకు లక్కీ నెంబరు! హో, న్యూమరాలజీ చక్కగా కుదిరింది. ఏస్ట్రాలజీ గ్యారంటీనే యిస్తున్నది. తాను చలిచీమ కావటం యిక కొన్నిరోజుల విషయం మాత్రమే ననుకున్నది, చిరుచీమ!

* * *

# భారతీయ చిత్రకారులు

రచన చిత్రాలు: కాలిపు సోమరాజు

## లక్ష్మణపై జననం: 1926

శ్రీ లక్ష్మణపై గోవాలో సారస్వత కుటుంబంలో జన్మించేరు. వీరి చిత్రాలు 40 సార్లకంటె అధికంగా ప్రదర్శించబడ్డాయి. దేశ విదేశాలలో వీరి చిత్ర శైలిపై చర్చలు, ప్రశంసలు వచ్చేయి. లలితకళా ఎకాడమీ వీరికి రెండు పర్యాయాలు బహుమతులిచ్చి గౌరవించింది. వీరిప్పుడు ఢిల్లీలో ఉంటున్నారు. వీరిది



అలంకరణ శైలి. 'ప్రాజెక్షన్' పద్ధతిలో వీరు చిత్రాలు రచిస్తారు.

వీరు తన మేనమామగారి ఫోటోగ్రఫీ స్టుడియోలో లేబ్‌బాయ్‌గా ఉంటూ చిత్రకళవైపు ఆకర్షితులయ్యేరు. బొంబాయి జె. జె. లో (1947) కళాభ్యాసం చేసేరు. ప్రతిభావంతుడైన విద్యార్థిగా విఖ్యాతి గాంచేరు. అక్కడే ఉపాధ్యాయుడుగా కూడా ఉన్నారు. తర్వాత పారిస్ వెళ్ళేరు; ఆ తర్వాత లండన్, ఆ తర్వాత మాతృదేశం రావాలనుకున్నారు. కాని ప్యారిస్‌లో కొన్ని సంవత్సరాలు ఉండిపోయేరు.

గోవా, కాశ్మీరు, గాంధీ జీవితం రామాయణ భారతాలు, గీతగోవిందం, ఋతుసంహారం మొదలైన వాటిని ఆధారంగా వీరు రచించిన చిత్రమాలలు బహుప్రశంసలందుకున్నాయి. వీరికి సంగీతంపై ప్రీతి మెండు.

చిట్లాగా పెద్ద మొత్తమే వస్తుంది కాబట్టి, యిక వ్యాపారాలు, లైసెన్సులు, టాక్సులు వీటిగొడవ ఉండదు. చక్కగా ఆ ఇరవై ఒక్కలక్షా బ్యాంకులో వేసు కుంటే, దానిమీద వచ్చే వడ్డీతోనే తరాలు గడిపేయవచ్చు. ఇప్పుడు బ్యాంకులు కూడ అర్ధరూపాయి వడ్డీ యిస్తున్నాయి కదా? ఆ లెక్కప్రకారం ఎంతవడ్డీ వస్తుందో? లెక్కలు కట్టాడు, చిట్టిబాబు. నూటికి అర్ధ అయితే, వెయ్యికి ఐదురూపాయలు లక్షకీ ఐదువందలు. ఇరవై ఒక్కలక్షకీ.. అబ్బో..పదివేల ఐదువందల రూపాయలు! నెలకు పదివేలపై చిల్లర ఆదాయం! ఇంకేం! హాయిగా కాలుమీద కాలు వేసుకు కూర్చోవచ్చు. ఓ రెండునెలల వడ్డీ పెట్టి కారు కొనుక్కోవచ్చు. ఓ సంవత్సరం వడ్డీ మనది కాదనుకుంటే వేడ! అసలు కదిలించకుండానే... అయితే ఈ వడ్డీ మీదకూడ ప్రభుత్వం టాక్సు వేస్తుందేమో?

చిట్టిబాబు వడ్డీ లెక్కలన్నీ ఆఫీసు టైములో, ఆఫీసు స్టేషనరీ మీదనే కట్టాడు. ఈ అనుమానం కూడా అక్కడే వచ్చి ఉన్నట్టయితే అప్పుడే దాన్ని నివృత్తి చేసుకొని ఉండేవాడు. అతనికి ఆలోచన వచ్చింది, ఆరాత్రి నిద్ర పోబోయే ముందు! దాంతో అతనికారాత్రి తెల్లవార్లూ నిద్దే పట్టలేదు. మర్నాడు ఆఫీసు కెళ్ళంగనే అడిగాడు. ఒరేయి శేషాచారీ, మనం కొంత డబ్బు బ్యాంకులో వేశామనుకో. దానిమీద వచ్చేవడ్డీకి కూడ గవర్నమెంటు ఇన్‌కం టాక్సు వేస్తారా?

'ఆ టాక్సు సంగతి తర్వాత చూద్దాం గాని, ముందా సూపర్నెంటు దగ్గరికి వెళ్ళు. చిందులు తొక్కుతున్నాడు' అన్నాడు శేషాచారి. వరుసలో ఉరకలు పెడుతున్న చీమ, వళ్ళు విరుచుకుంటున్న చీమను రాచుకుంటూ వెళ్లి పోయింది!

ఆస్పత్రికి రోజూ బోలెడన్ని పాలు కొంటారు. నెలకు ఎన్ని పాలు కొనేది ఫిగరు కావాలన్నాడు, కొత్త సూపర్నెంటు. పదివేల ఐదువందల రూపాయలు అని తన వడ్డీ ఫిగర్ వేసి పంపించాడు, చిట్టిబాబు. కొత్త సూపర్నెంటు తెగమురిసి పోయాడు. అంటే తనకు నెలకు రెండువేల ఒకందద ఆదాయం వస్తుందన్నమాట. ఏ పాలవాడైనా సరే సూపర్నెంటుకి ఖచ్చితంగా ఇరవై

కాలం యివ్వవలసిందేగదా? పాలతనికి కబురు పెట్టాడు, ఆ వెలసొమ్ము అద్వాన్నుగా పంపమని. పాలవాడు ఐదువందలూ యిచ్చి దండం పెట్టాడు. మరి ఆ పత్రికి కొనేది రెండువేల ఐదువందల రూపాయల పాలేకదా? సూపర్నెంటుకి వళ్ళు మండిపోయింది. ఫిగర్ పంపిన పాలూ బ్రెడ్డూ సీటు గుమాస్తాను సంజాయిషీ యిచ్చుకోమని ఆదేశించాడు; అవును మరి. అక్కడాయన యింటిదగ్గర సంజాయిషీ యిచ్చుకోలా, పాపం! యిట్లాగూ రెండువేలు వస్తున్నయిగదాని, ఆ సాయంత్రం వచ్చేటప్పుడు రవ్వల దుద్దులు తెస్తానని మాట యిచ్చి వచ్చేట్ట, ఆయన. అవి తీసుకు వెళ్ళనందుకు ఎంత సంజాయిషీ చెప్పుకోవలసి వచ్చిందో?

వెధవ సంజాయిషీ! ఈ సూపర్నెంటు, గీపర్నెంటుల్ని తాను లెక్కచేస్తాడా ఏమిటి? ఈ నాలుగు రోజులూ పోతే, ఏకంగా రిజిగ్నేషనే పారేయవచ్చు నన్నాడు, చిరుచీమ జీవితంతో రోసిపోయిన చిట్టిబాబు.

కాకపోయినా వెధవ దిద్దులకి రెండు వేలు ఎందుకో తెలియలేదు, చిట్టిబాబుకి. క్రిందటిసారి ఫ్లూ వచ్చినప్పుడు, ఊళ్లో మందుల కొట్లవాళ్ళూ ఆస్పత్రి స్టాఫుకంతా తలా వందా బోనసు పంచిపెట్టారు. అవి పెట్టి దిద్దులు కొన్నాడు, చిట్టిబాబు. తొంభయ్యైదు రూపాయలకే చక్కటి దిద్దులు వచ్చినై. మరి రెండువేల రూపాయల దిద్దులేమిటో. చలిచీమ జీవితాన్ని గురించి తనకంతా తెలుసుననుకున్న చిరుచీమ కాస్తంత సిగ్గుపడ్డది.

'ఏమే, రవ్వల దిద్దులు కావాల్నా నీక్కాడా? ఓ రెండువేలు పెట్టి చేయిస్తాను' అన్నాడు చిట్టిబాబు సిగ్గును దాచుకుంటూ.




# చీమ బ్రతుకు

'వాళ్ళ రెండువందలు పెట్టి కంచి చీరె కొనమంటే లేదుగాని, రెండు వేలు పెట్టి దిద్దాలు చేయిస్తారుట' అంటూ దెప్పి పొడిచింది, మిసెస్ చిట్టిబాబు

ఈ పిచ్చి బాగులదాని మాటలతో చిరెత్తుకొచ్చింది చిట్టిబాబుకి. తర్వాతా పిచ్చి బాగులదానిమీద జాలేసింది. దీనికసలు తర్కలవిద్యలంటే ఏమిటో తెలిసుండదు, అనుకున్నాడు.

'చూడూ, నువ్వు రేపే సుబ్బయ్య కొట్టుకెళ్ళి, ఆ చీరేదో తెచ్చేసుకో. వచ్చే నెల ఇరవైనాలుక్కి డబ్బిస్తానని చెప్పు' అని భార్య కోర్కెను అద్భుతంగానే తీర్చేడు, చిట్టిబాబు.

జయపూరు వెళ్ళి డబ్బు ఎలా తేవాలో కూడ ఆలోచించే పెట్టుకున్నాడు, చిట్టిబాబు. ఆఫ్ఫీసు పనిమీద ఊరు వెళ్తున్నానని యింట్లో చెప్పి జయపూరు వెళ్తాడు. అక్కడ టిక్కెట్టు ప్రెజెంటుచేసి, చెక్కు తీసుకుంటాడు. తర్వాత యింటికి వచ్చి, నిదానంగా తనకు డబ్బు వచ్చిన సంగతి చెప్తాడు. అదీ యింత పెద్దమొత్తం వచ్చినట్లు చెప్పకూడదు. ఇంతడబ్బు వచ్చిందంటే, యిక పిల్లలు శ్రద్ధగా చదువ్వరు. వాళ్ళని జాగత్తగా పెంచాలికదా? కాబట్టి వాళ్ళు చదువుల్లో వృద్ధిలోకి వచ్చే వరకు వచ్చిన మొత్తాన్ని రహస్యంగా ఉంచాలి. ఈలోపల వాళ్ళకు ఏలోటు రాకుండా చూడాలి. పెద్దవాడు సైకిలని గోలపెట్టున్నాడు. వాడికో స్కూటరన్నా కొనివ్వాలి.

'ఒరేయి బాబూ, నీకు వచ్చేనెలలో స్కూటరు కొనిస్తారా?' అన్నాడు చిట్టిబాబు.

'స్కూట రెందుకుగాని, ఒక్క నూట యాభై పారేయి. ఆ గోపీగాడు సైకిలమ్మతాట్ట కొనుక్కుంటాను' అన్నాడు పెదవాడు.

చీమ సంపాదనతో చిర్రెత్తిపోయిన చిట్టిబాబుకు ఈ మాటలతో మరింత కోపమొచ్చేసింది. తర్వాత జాలేసింది. చలిచీమ హాయిలను గురించి ఊహించను కూడలేరు. వెధవలు! పోన్లే. అలా ఉండటమే మంచిది. అనవసరంగా వాళ్ళకు దర్జాలు తాను నేర్పట మెందుకు?

'ఒరే' నువ్వా సైకిలు తీసుకో. వచ్చే నెల్లో డబ్బు యిస్తానని వాళ్ళనాన్నతో చెప్తాన్లే' అన్నాడు, చిట్టిబాబు

తెలవారేటప్పటికి సైకిలు యింటి కొచ్చింది. ఏనుగు అంబారీమీద ఊరేగే మహారాజులా సైకిలుమీద యింటికొచ్చాడు పుత్రరత్నం. అది చూసి కూతురు నసగటం మొదలు పెట్టింది, ఆవిడకో రెండు జార్జెటు వోణీలు కావాలిట. ఎంత. వెధవది యాభై రూపాయలు! వీళ్ళ చీమకోర్కె చూస్తే నవ్వువచ్చింది చిట్టిబాబుకి 'అమ్మ చీరతోపాటు, నువ్వోణీలు కూడ తెచ్చుకోపో' అన్నాడు చిట్టిబాబు

చీమ సన్నాసులు! గొప్ప జీవితాన్ని గురించి ఊహకూడలేని జీవులు! తానంటే రకరకాల మనుషులతో తిరుగుతాడు. కాబట్టి తనకు అన్నిఫాయీల జీవితం తెలుసు. రేపు అన్నిలక్షలు వచ్చినా తాను నిబ్బరం చెడగొట్టుకోడు. 'తనవాళ్ళు అట్లా కాదే! కాబట్టి వీళ్ళకు డబ్బువచ్చిన సంగతి చెప్పనే కూడదు. మరి చెప్పకుండా తాను ఉద్యోగం మానేసి యింట్లో కూర్చుంటే విట్లా? ఈపాడు ఉద్యోగం దానంతట అది పోతే బాగుండు నను కున్నాడు. చిట్టిబాబు.

ఐడియా వచ్చింది, చిట్టిబాబుకి.

సూపర్నెంటు ఎలాగూ వంకాయిషీ అడిగాడు కదా?

అది యివ్వకుండా ఉంటేసరి. ఇన్ సబార్డినేషనుచార్జి పెట్టి, వాళ్ళే తీసేస్తారు.

అంతే చేశాడు, చిట్టిబాబు.

చలిచీమలా పైన ఎగరాలంటే, క్రింది చూపులు పనికిరావు మరి!

* * *

లాటరీలో ప్రైజు వచ్చింది, చిట్టిబాబుకి. అందులో సందేహం లేదు. అది వస్తుందని విశ్వసించటంలో కూడ అతనేమీ పొరపాటు చెయ్యలేదు. కాకపోతే తనకు వచ్చిన డబ్బు తనకు యిన్ని చిక్కులను తెచ్చి పెడుతుందని మాత్రమే అతను ఊహించలేక పోయాడు.

ఎందుకనంటే అతనికి వచ్చింది. కన్సొలేషన్ ప్రైజు నాలుగు వందల రూపాయలు మాత్రమే!

బట్టలకొట్లో రెండువందల యాభై, సైకిలు వాళ్ళకి నూటయాభై, వచ్చిన మొత్తం సరే పోయింది.

పోన్లే, చేసిన అప్పులవరకైనా సరిపోయిందిలే అని తృప్తిపడ్డాడు, చిట్టిబాబు

ఇంతలో పిడుగులాంటి వార్త! విండ్ ఫాల్ ఆదాయాలమీద భారత ప్రభుత్వం వారు పన్ను వేశారుట. యాభైరూపాయలు పన్నుకింద పోతైట!

గురు మహర్దశలో ఉన్నవారికి కూడ ఈ శనిగాడి వీక్షణం తప్పలేదే — అను కున్నాడు చిట్టిబాబు — తామరాకు మీది నీటిబొట్టులా మెరుస్తూ.


పోన్లే, వచ్చేనెల జీతంలోనో, నాతంలోనో ఆ యాభై సర్దలేక పోతానా? అనుకున్నాడు, చిట్టిబాబు.

ఆఫీసుకెళ్ళాడు, చిట్టిబాబు, హుషారు చీమ హడావుడితో.

సస్పెన్షను మెమో ఎదురు వచ్చింది, చిట్టిబాబుకి.

ఎక్కడో. ఏ కాలి కిందనో నలిగి చీమ ఒకటి చిటుక్కుమని ధ్వని చేసింది!

రెక్కలు రాకపోంగా, రోడ పాలైంది, రాయుడు చీమ! ●

అంతాచేసి యేడాదే. ఇంతలోనే ఆరు పళ్ళ వచ్చేశాయి. ఎంతో సరదాగా వున్నాడు.
ఆరోగ్య సూచకమైన ఆకలి. గాఢ నిద్రపోతాడు
కాని కడుపునొప్పి?
అది తగ్గటం ఎంతో సేపు కాదులెండి.
బేబీటోన్ గ్రైప్ మిక్శ్చర్‌కు ధన్యవాదాలు
స్టాకిస్టు: ABC వారి ఉత్పత్తి
అమర్‌శోభ పోస్టు బాక్సు 518, మద్రాసు-3
పోస్టు బాక్సు 16460 బొంబాయి-16